విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, నవంబర్ 19 : టి.ఎస్.ఎస్.పి.డి.సి.ఎల్. ఆజామాబాద్ డివిజన్ 11 కె.వి. చెన్నారెడ్డి నగర్, బాపూ నగర్, సీపీఎల్, ప్రేమ్ నగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జీ నాగేశ్వరరావు తెలిపారు.

ఉదయం 10 నుంచి 12 గంటల వరకు

చెన్నారెడ్డి నగర్ ఫీడర్ పధిలోని న్యూ పటేల్‌నగర్, మహ్మద్‌నగర్, పోచమ్మబస్తీ టెంపుల్, సమోస కార్ఖానా, బిమిల్లా హోటల్ పరిసరాల్లో

ఉదయం 11: 30 నుంచి 1:30 గంటల వరకు

బాపూనగర్ ఫీడర్ పరిధిలోని బాపూనగర్, ఒవైసీ నగర్, నెక్లెస్ హోటల్, ఆకాశ్ నగర్ పరిసరాల్లో

మధ్యాహ్నం 2 నుంచి 3: 30 గంటల వరకు

సీపీఎల్ ఫీడర్ పధిలోని పటేల్‌నగర్, ప్రేమ్‌నగర్, పటేల్ వాడ, సీపీఎల్ క్వార్టర్స్ పరిసరా ప్రాంతాల్లో

మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు

ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలోని ప్రేమ్‌నగర్, పటేల్‌నగర్ చౌరస్తా, హనుమాన్ టెంపుల్, సుందర్‌బౌలి ఝుంక్షన్, ఉదయం స్కూల్, బీజేపీ జెండా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

బేగంపేట్, నవంబర్ 19 : సాంకేతిక లోపాలు, ట్రిమ్మింగ్ కారణంగా నేడు (మంగళవారం) సికింద్రాబాద్ ప్యారడైజ్ ఏఈడీ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపడుతున్నట్టు ఎలక్ట్రిసిటీ అధికారులు తెలిపారు. ఉస్మానియా సబ్‌స్టేషన్.. కృష్ణనగర్ ఫీడర్ పరిధిలోని కేశవ నగర్, స్కైలాబ్ హోటల్, సువర్ణ అపార్ట్ మెంట్, రైల్వే వాటర్ వర్క్స్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు , రవీంద్రనగర్ ఫీడర్ పరిధిలోని రవీంద్రనగర్, మోడల్ స్కూల్ పీటీ, దోభీఘాట్, ఈఎఫ్ఎల్ బ్యాక్‌సైడ్, మాణికేశ్వర్‌నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్టు అధికారులు తెలిపారు.

నవచండీ యాగం..

బంజారాహిల్స్ : బంజారాహిల్స్ రోడ్ నం.14లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రివద్ద శ్రీ విజయగణపతి ఆలయంలో రుద్రయాగ సహిత నవచండీ మహా యాగాన్ని నిర్వహిస్తున్నారు.

పరిహారమే తప్ప..ప్రత్యేక ఫండ్ ఎక్కడ?

- కంటోన్మెంట్ అభివృద్ధిపై హస్తానికి చిత్తశుద్ధి కరువు
- బీఆర్ఎస్ హయాంలో రూ.100కోట్ల సాయం
- టీపీటీ బకాయిలు చెల్లించక దృష్టి మరల్చిన కాంగ్రెస్

కంటోన్మెంట్, నవంబర్ 19 : సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గానికి పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లిగవ్వ విదిల్చడం లేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ మండిపడ్డారు. ఎలివేటెడ్ కారిడార్ల కోసం అప్పగించిన కంటోన్మెంట్ భూములకు సంబంధించి పరిహార నిధులను విడుదల చేస్తున్నట్లు జీవోలో స్పష్టంగా ఉన్న ఆదేదో కంటోన్మెంట్‌కు ప్రత్యేక సాయం అందించినట్లు కాంగ్రెస్ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మంగళవారం కంటోన్మెంట్‌లో విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దేవులపల్లి శ్రీనివాస్‌తో కలిసి టీఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రత్యేక నిధులు విడుదల కాలేదన్నారు. ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్ల కోసం కంటోన్మెంట్ బోర్డు 24.6 ఎకరాల భూమిని అప్పగించిందన్నారు. ఇందుకు గానూ రాష్ట్ర ప్రభుత్వం రూ.303 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ నిధులను కేంద్ర ప్రభుత్వ కన్సాలిడేటెడ్ ఫండ్‌లో జమ చేయకుండా, అంతే విలువ కలిగిన పనుల కోసం కేటాయించాలని బోర్డు నిర్ణయించడంతో కేంద్రం సానుకూలంగా స్పందించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులతో కంటోన్మెంట్‌లో డ్రైనేజీ, నాలాల అభివృద్ధికి ముందుకొచ్చిందన్నారు. అయినా ఈ నిధులకు సంబంధించి చేపట్టాల్సిన పనులకు కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో అనుమతులు రావాల్సి ఉందన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. పరిహారం నిధులతో పనులు చేపడుతూ, అవి రాష్ట్ర ప్రభుత్వం నిధులు అని చెప్పుకుంటుండటం విడ్డూరంగా ఉందన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, దివంగత ఎమ్మెల్యే సాయన్న నియోజకవర్గానికి ప్రత్యేక సాయంగా డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయాల నిర్మాణాల కోసం రూ.100 కోట్లకు పైగా నిధులు రప్పించార్నారన్నారు. బీఆర్ఎస్ సర్కారు కంటోన్మెంట్ అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా అప్పటి మంత్రి కేటీఆర్ ప్యాట్నీ నాలాను ఎస్ఎన్‌డీపీ ద్వారా రూ.10 కోట్లతో ఆధునీకరించగా, రామన్న కుంట చెరువు ప్రక్షాళనలకు రూ.12కోట్లతో పనులను చేపట్టారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ సర్కారు కొలువు దీరి ఏడాది కావొస్తున్నా కంటోన్మెంట్ అభివృద్ధిపై కనీసం దృష్టి సారించడం లేదని విమర్శించారు. అక్టోబర్ వరకు బోర్డుకు రావాల్సిన టీపీటీ బకాయిలు రూ.46కోట్లను విడుదల చేయకుండా కాంగ్రెస్ సర్కారు మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. ఇప్పటికైనా బోర్డుకు రావాల్సి బకాయిలతో పాటు కంటోన్మెంట్ అభివృద్ధి తక్షణ సాయం కింద రూ.100 కోట్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్

కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

ఓఎస్డీ ప్రొ. జితేందర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 19: టెక్నాలజీ కళాశాలలో నెలకొని ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్వీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో కళాశాల నుంచి పరిపాలనా భవనం వరకు ర్యాలీ నిర్వహించి, ఓఎస్డీ ప్రొ. జితేందర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్వీ నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల న్నారు. హాస్టల్‌లో సరైన వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని విజ్ఞప్తి చేశారు.

వైద్యశిబిరం ఏర్పాటు..అభినందనీయం

అడిక్‌మెట్ డివిజన్ విద్యానగర్‌లో ఆంధ్రా మహిళా సభ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం బీఆర్ఎస్ యూత్ విభాగం నాయకుడు ముఠా జయసింహా ప్రారంభించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హేమలత, డాక్టర్ హరిణి వాసురెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కె.సురేందర్, అనురాధ, యాదగిరి, సింధు, ప్రేమ్‌కుమార్, యూనిస్, అబ్బు, సత్యనారాయణ, హరీశ్, జ్ఞాని పాల్గొన్నారు.

- ముషీరాబాద్

యూటర్న్ తిరిగి ప్రారంభించాలి

సికింద్రాబాద్, నవంబర్ 19 : మెట్టుగూడ జంక్షన్, హోటల్ స్కైలాబ్ వద్ద యూటర్న్ తిరిగి ప్రారంభించాలని ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌ని మెట్టుగూడ కార్పొరేటర్ సునిత కోరారు. మంగళవారం ట్రాఫిక్ పోలీసులు, ఇతర అధికారులతో కలిసి ఆ ప్రాంతాలను కార్పొరేటర్ పరిశీలించారు. యూటర్న్ తొలగించడంతో 15,000 లకు పైగా నివసించే బస్తీ వాసులకు ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు.. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతున్నదన్నారు. కార్యక్రమంలో బస్తీ వాసులు, జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

సన్మానం..

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 19: నిజాం కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొ.ఏవీ రాజశేఖర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు సన్మానించారు. టీజీవో హైదరాబాద్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బోయ కుమార్ మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మక నిజాం కళాశాల ప్రిన్సిపాల్ పదవి ఉన్నతమైనదన్నారు.

వేలాది మంది విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే బాధ్యత ప్రిన్సిపాల్‌పై ఉంటుందని చెప్పారు. విద్యార్థులకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు.

పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలి

చిక్కడపల్లి, నవంబర్ 19 : పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలని గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. బాలల దినోత్సవం నేపథ్యంలో మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద నవ తెలంగాణ పబ్లిషికంగ్ హౌస్ ఆధ్వర్యంలో పిల్లల పుస్తక ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్మన్ రియాజ్ విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పబ్లిషింగ్ హౌస్ జనరల్ మేనేజర్ వాసు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌వీకే కమిటీ సభ్యుడు బుచ్చిరెడ్డి, సీపీఎం రాష్ట్ర సెక్రటేరియట్ ఎండీ అబ్బాస్, శోభన్ నాయక్, కోటా రమేశ్, టి.స్కైలాబ్ బాబు, కృష్ణారెడ్డి, ధనలక్ష్మి, సిద్దు, సుభాషిని, రఘు, కాశీ పాల్గొన్నారు.

ఎర్రకుంట పునరుద్ధరణ షురూ..

ఎర్రకుంట చెరువులో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 19 : తార్నాక డివిజన్‌లోని ఎర్రకుంట చెరువు పునరుద్ధరణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. మారేడ్‌పల్లి మండలం పరిధిలోని 5.9 ఎకరాల్లో ఉన్న ఎర్రకుంట చెరువు పునరుద్ధరణకు గతంలో మార్కింగ్ చేశారు. చెరువు ఆక్రమణలపై ఫిర్యాదులు రావడంతో ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెరువును పరిశీలించారు. ఈ నేపథ్యంలో గతంలో మార్కింగ్ చేసిన 5.9 ఎకరాల్లోని పిచ్చి మొక్కలు, చెట్లను జేసీబీలతో తొలగించారు. ఇరిగేషన్ అధికారులు, మారేడ్‌పల్లి తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, డీఆర్ఎఫ్ సిబ్బంది పనులను చేపట్టారు. ఇరిగేషన్ ఏఈ సుధీర్ మాట్లాడుతూ.. త్వరలోనే ఎఫ్‌టీఎల్ నిర్ధారించి, ఆక్రమణలపై సైతం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రగతి చక్ర వార్డులు ప్రదానం

టి.జి.ఎస్.ఆర్.టి.సి. ముషీరాబాద్ డిపోలో ఉత్తమ సేవలందించిన సిబ్బందికి మంగళవారం నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. హైదరాబాద్ రీజనల్ మేనేజర్ బి. వరప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రగతి చక్రం అవార్డులు అందజేశారు. డిపోలో అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లు, ఆయిల్ సేవ్ చేసిన డ్రైవర్స్ ప్రగతి చక్ర వార్డులు ప్రదానం చేసి అభినందించారు. ముషీరాబాద్ డిపో మేనేజర్ టి.కిషన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చార్మినార్ డివిజన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ నాయక్, చార్మినార్ డివిజన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ (మెకానిక్) జగన్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ముషీరాబాద్

బాక్సింగ్ పోటీల్లో పతకాలు

సికింద్రాబాద్ : బాక్సింగ్ పోటీల్లో సీతాఫల్‌మండి విద్యార్థులు పతకాలు సాధించారు. హైదరాబాద్ డిస్ట్రిక్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68వ ఇంటర్ స్కూ ల్స్ డిస్ట్రిక్ లెవల్ బాక్సింగ్ టోర్నమెంట్ 2024 – 25 కు గాను ఈ నెల 16 –18న నిర్వహించారు. పోటీలు జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, షేక్‌పేటలో జరిగాయి. మేడిబావి ఆర్య సమాజ్ బాక్సింగ్ టీం విద్యార్థు లు పతకాలు సాధించారు. బాక్సింగ్ పోటీలో కేఆర్‌కే వర్షిణి అండర్ 17, ఏ ప్రణీత అండర్ 14, వి. తర్ష తేజ, డి. శశాంక్ అండర్ 17, డి. శంకు అండర్ 14, ఎం. లోకేశ్వర్ అండర్ 14లో బంగారు, సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించారు. స్టేట్ లెవెల్ బాక్సింగ్ పోటీలకు వర్షిణి , ప్రణీత, శివ సెలెక్ట్ అయ్యా రు. బాక్సింగ్ కోచ్ శివరాజ్, అసిస్టెంట్ బాక్సింగ్ కోచ్ రాజేశ్ వారిని అభినందించారు.

కలుషిత నీటి సమస్యను పరిష్కరిస్తాం

చిక్కడపల్లి, నవంబర్ 19 : గాంధీనగర్ డివిజన్‌లోని సబర్మతి నగర్ తదితర బస్తీల్లో నెలకొన్న కలుషిత నీటి సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ అన్నారు. సబర్మతి నగర్ బస్తీలో కలుషిత నీటిసరఫరా కావడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ వాటర్ వర్క్స్ మేనేజర్ మల్లేశ్ తో కలిసి సబర్మతి నగర్ బస్తీలో మంగళవారం పర్యటించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ..కలుషిత నీటి సరఫరాను సమస్యను పరిష్కరించాలని వాటర్ వర్క్స్ అధికారులకు ఆదేశించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, నాయకులు ఉమేశ్, కుమార్, సాయికుమార్, ఆనంద్ రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల నిర్మాణానికి నిధులు కేటాయించాలి

సికింద్రాబాద్, నవంబర్19 : సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల భవన సముదాయ నిర్మాణానికి రూ.30 కోట్లు కేటాయించాలని కోరుతూ.. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సీఎం రేవంత్ రెడ్డి కి లేఖ రాశారు. ఈ నెల 14న లష్కర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ఈ భవన నిర్మాణం మధ్యలో ఆగిపోవడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. దాంతో సీఎంకు లేఖ రాశారని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 19: ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ 'చదువుతూ పోరాడు – చదువుకై పోరాడు' నినాదంతో 90 ఏండ్లుగా ఏఐఎస్ఎఫ్ పోరాటం చేస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేశ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య, ఓయూ అధ్యక్షుడు లెనిన్, కార్యదర్శి నెల్లి సత్య, ఆరేకంటి భగత్ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

గ్రంథాలయ ఉద్యోగులు, రిటైడ్ ఉద్యోగులతో నగర గ్రంథాలయం పర్సన్ ఇన్‌చార్జి, హైదారాబాద్ అడిషన్ కలెక్టర్ పళని కదిరవన్

చిక్కడపల్లి, నవంబర్ 19 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నగర గ్రంథాలయం పర్సన్ ఇన్‌చార్జి, హైదారాబాద్ అడిషన్ కలెక్టర్ పళని కదిరవన్ అన్నారు. చిక్కడపల్లి నగర గ్రంథాలయం సంస్థలో 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రళని కదిరవన్, నగర గ్రంథాలయం సంస్థ కార్యదర్శి పి.పద్మజ, మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఫణి కుమార్ హాజరయ్యారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. గ్రంథాలయ రిటైర్డ్ మహిళా ఉద్యోగులను సన్మానించారు. పళని కదిరవన్ మాట్లాడుతూ పుస్తక పఠనానికి రోజూ కొంత సమయం కేటియించాలని సూచించారు. గ్రంథాలయ మాజీ ఉద్యోగుల సంఘం నాయకులు కొక్కుల దేవేందర్, సత్యనారాయణ, గ్రంథాలయం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చాగంటి అయోధ్య, కార్యదర్శి బొల్లం మహేందర్, వరప్రసాద్, సభ్యులు నరేందర్, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, అవినాశ్, వెంకటేశ్ యాదవ్, సుఖేశ్‌కుమార్, గ్రేడ్ –1 లైబ్రేరియన్ చంద్రకళ సుబ్బలక్ష్మి, శుక్ల ప్రతిభా రెడ్డి, లలిత, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

సర్టిఫికెట్లను అందజేసిన క్రితి సోషల్ ఇనీషియేటివ్ వ్యవస్థాపకురాలు హిమానిగుప్తా

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

బన్సీలాల్‌పేట్ : మహిళలు ఆర్థికంగా దగాలని, వారికి తమ సంస్థ ద్వారా నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించి వారి అభ్యున్నతికి పాటుపడుతున్నామని క్రితి సోషల్ ఇనీషియేటివ్ వ్యవస్థాపకురాలు హిమానిగుప్తా అన్నారు. న్యూ బోయిగూడలో టైలరింగ్, బ్యూటిషియన్ కోర్సులో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులు అందజేశారు. శ్రీలతా చేబ్రోలు తో కలిసి తాము 2009లో సంస్థ స్థాపించామని, విద్య, ఉపాధి, నైపుణ్య శిక్షణ, స్వయం సహాయక బృందాల ఏర్పాటు రంగాల్లో మురికివాడల్లో పనిచేస్తున్నామన్నారు. ఆర్థికంగా అండగా నిలిచేలా మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నామన్నారు. ప్రతి ఏడాది 400 మందికి టైలరింగ్, 300 మందికి బ్యూటిషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ స్వప్న, టీచర్లు ఎ.జ్యోతి, జి.జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

అనవసరంగా యాంటీ బయోటిక్స్ వాడొద్దు

బన్సీలాల్‌పేట్ : జలుబు, దగ్గు, జ్వరం లాంటి ఇన్‌ఫెక్షన్‌కు అనవసరంగా యాంటీ బయోటిక్స్ వాడకూడదని, వైద్యుల సూచన మేరకే వినియోగించాలని గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఇందిర అన్నారు. మంగళవారం మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో 'వరల్డ్ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ అవేర్‌నెస్ వీక్'(వావ్) సందర్భంగా గాంధీ వైద్య కళాశాల నుంచి క్యాజువాలిటీ, ఓపీ విభాగం, మహాత్మాగాంధీ విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఇందిర, సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ఎన్.రాజకుమారి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. వైద్యుల వద్దకు వెళ్లకుండా దగ్గరలోని మెడికల్ దుకాణాల నుంచి మందులను కొనుగోలు చేసి, డాక్టర్లు చెప్పినట్టు కాకుండా రెండు మూడురోజులు వాడి తగ్గగానే మానేస్తారన్నారు. ఒక్కొక్కరి శరీర తత్వాన్ని బట్టి మందులు తమ ప్రభావం చూపుతాయని, అలా కాకుండా మనం సొంతంగా యాంటీ బయోటిక్స్ వాడకూడదని సూచించారు. సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇష్టాను సారంగా మందులను వాడి, తరువాత రోగం తగ్గలేదని వైద్యులకు ఫిర్యాదు చేయడం తగదని ఆమె అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశేఖర్‌రావు, మైక్రోబయాలజీ విభాగం హెచ్ఓడీ, ప్రొఫెసర్ సురేఖ, అసోసియేట్ ప్రొఫెసర్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ పూజ, ఆర్ ఎంఓ డాక్టర్ శేషాద్రి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ గౌడ్, పీజీ, యూజీ విద్యార్థులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి

బీఈ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులు ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 19: ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ) బ్రిడ్జి కోర్సు సెమిస్టర్ల మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. విద్యార్థులు తమ మెమోను రెండు వారాల తర్వాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి 25వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రూ.200 అపరాధ రుసుంతో 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి 26వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 19: ఓయూ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల (బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ తెలిపారు. ఈ కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 30 నుంచి, ఆరో సెమిస్టర్ మేకప్ పరీక్షలను ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 19 : ఓయూ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ.శశికాంత్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షా ఫీజును ఈనెల 21 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని, రూ.500 అపరాధ రుసుంతో 23వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని, ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.